


నాకు ఉదయమే టీ తాగే అలవాటుంది. లేవగానే టీ త్రాగితేనే గాని నిద్రమత్తు వదిలినట్లు వుండదు. పైగా అది తాగితే ఎంతో శక్తి వచ్చినట్లు వుంటుంది కూడా.

ఆ రోజు ఎప్పటిలా ఉదయం లేవగానే టీ కోసం ఎదురు చూశాను. నేను లేచి గంటసేపైనా నా దగ్గరకు టీ రాలేదు, ఆశ్చర్యంగా వుంది ఆరోజెందుకో?

మా పెద్ద కొడుకు బుజ్జిగాడ్ని పిలిచాను గట్టిగా. అయిదు నిమిషాలు కాదు అరగంట అయినా వాడు రాలేదు. వాడా నేనయినా రానందుకు నాకు వాడిమీద కోపం ముంచుకొచ్చింది.

"ఒరేయ్ బుజ్జీ... ఎక్కడ చచ్చావురా" ఈసారి నా కోపంతో తిట్లు మీద ప్రయోగించాను.

అయినా వాడు రాలేదు. వాడి కోసం ఎదురు చూస్తున్నాను. ఇంతలో ఏదో గుర్తుకు రావడంతో నాకెక్కడలేని నీరసం ఆవహించినట్లయింది.

అది—

నిన్న రాత్రి మా బుజ్జిగాడు పట్నం వెళ్లాడు మా చిన్నాన్న వాళ్ళతో కలిసి. వాడు లేడన్న సంగతి నేను లేచిన అరగంటకిగాని తెలిసింది కాదు నాకు.

బుజ్జిగాడు లేకపోవడంతో నాకు టీ తెచ్చేవాడెవరున్నారు. మా యింట్లో నేను, మా అంకుల్ ఉదయం లేవగానే టీ తాగుతాం.

నేను లేచి మా 'అంకుల్' గదిలోకి రాగానే నాలాగే టీ కోసం ఎదురు చూస్తున్నట్లుంది. నన్ను చూడగానే అతని ముఖం ఆనందంతో వికసించింది.

"సార్! మరి టీ స్టాల్ కెళ్ళి టీ తీసుకురానా? ఇద్దరం ఫస్ట్ ఫస్ట్ తీసుకొందాం" అన్నాడు మా అంకుల్.

నాకు ఎక్కడలేని కోపం వచ్చింది. రోజూ బెడ్ మీదుండగానే టీ తాగేవాణ్ని. అలాంటిది ఈ రోజు బుజ్జిగాడు లేకపోవడంతో నేనే వెళ్ళాల్సి వస్తుందనుకోలేదు.

'తీసుకురానా?' అంటే మర్యాదెట్టుంటుంది స్టైలు కాలేజీతో బయలుదేరాను.

నేను టీ కోసం బయలుదేరి రావడం అదే మొదటిసారి. మరి టీ స్టాల్ దగ్గరకొచ్చేసరికి టీ కోసం చాలా మంది నిలబడి వున్నారు. మరి స్టవ్ వెలిగించి కెటిల్ ఒక స్టవ్ మీద, పాలు ఒక స్టవ్ మీద పెట్టాడు.

'టీ చేయడానికి ఎంత సేపవుతుందో?' ఆలోచిస్తూ నిలబడ్డాను. అయిదు... పది... పదిహేను... ముప్పయ్యి అరగంట గడిచింది.

టీ యింకా నా చేతికి రాలేదు. నాకు యివ్వలేదు.

టీ వేడెక్కింది. అక్కడ తాగేవాళ్ళకి గ్లాసుల్లో టీ యిస్తున్నాడు. నాతో వచ్చిన వాళ్ళు టీ పట్టుకుని వెళ్ళిపోయారు అప్పుడే! 'మరి నాకెందుకింకా యివ్వలేదు?' అర్థం కాకుండా వుంది.

"మరి త్వరగా టీ వేయ్" అన్నాన్నేను కోపంగా.

అతనికి వినపడిందో లేదోగాని నాకు మాత్రం టీ చేసి యివ్వలేదు. ఎవరికో టీ చేస్తున్నాడు. నా కోపం తారాస్థాయికి చేరుకోసాగింది.

టీ వేస్తావా? వేయవా? అడిగేయాలనుంది. వేయను పొమ్మంటే? ఏం వేయాలి? ఈ వీధికి వీడొక్కడే కొట్టే వుంది.

నాకీసారి నిజంగా కోపం వచ్చింది. ఆ వచ్చింది 'మణి' మీద కాదు. నా అలవాటు మీద. ఛీ. వెధవ టీ తాగకపోతే వుండలేమా?

ఈ దిక్కుమాలిన టీ కోసం గంట నుంచి వెయిట్ చేస్తున్నాను. అయినా యిచ్చి చావలేదు.

ఇంతలో—

మా బుజ్జిగాడు గుర్తొచ్చాడు. వాడి మీద కోపం పోయి ప్రేమ పుట్టుకొచ్చింది.

'ఇందుకన్నమాట' పాపం వాడు రోజూ మా కంటే గంట ముందు లేచేది? మా బుజ్జిగాడు రోజూ పెందలాడే లేచి, క్యూలో నిలబడి మాకు టీ తెస్తాడు. మేము తాగుతాం. అంతే ఆలోచించాం తప్ప, వాడెంత కష్టపడుతున్నాడో నాకు అప్పటిగానీ అర్థం కాలేదు. నాక్షణంలో 'టీ' మీద ఏవహింపు కల్గింది. అంతే నేను 'టీ' తాగే అలవాటు మానెయ్యాలనుకున్నాను.

ప్రయోజనం లేని వాటిని అలవాటుగా మార్చుకుంటే ఇలానే వుంటుంది మరి?

నేను ఆలోచనలతో వుండగా ఆ దరిద్రుడు అప్పుడు ఇచ్చాడు టీ కారేజ్‌తో.

నేను ఇంటికొచ్చి అంకుల్ చేతికి కారేజ్ అందించి—

"నువ్వు తాగితే తాగు అంకుల్. నేను మాత్రం టీ తాగను" అన్నాను సడెన్‌గా.

మా అంకుల్ ఆశ్చర్యపోతారని నాకు తెలుసు. నేను అనుకున్నట్లుగానే జరిగింది.

"ఏం? ఎందుకు తాగవు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు అంకుల్.

నేను జవాబు చెప్పకుండా గదిలోంచి బయటికొచ్చి కాలకృత్యాలు తీర్చుకోవడంలో నిమగ్నమయ్యాను.

నేను వచ్చినవైపే మా అంకుల్ అదోలా చూస్తుండిపోయారు. ఆ చూపులో "వీడికి టీ అంటే ప్రాణం కదా! ఎందుకు టీ తాగనంటున్నాడు?" అన్న ప్రశ్న వుంది.

ఆ ప్రశ్నకు జవాబు దొరకాలంటే టీ కొట్టు దగ్గర జరిగిందంతా చెప్పాలి మరి నేను!

**భీశెట్టి శ్రీనివాసరావు**

# కవితాలహరి

## దివ్యౌషధం

చీకట్లో చిరు దివ్వెలు వెలిగించే
చిరునవ్వు!
గుండె లోతుల్లో గలగల పారే
సెలయేరు సవ్వడిలాంటి నవ్వు!
అరవరసిన గులాబి పెదాలపై విరబూసిన
అందాల చిరునవ్వు!
ప్రియుని కౌగిట్లో పులకింతల
చిరునవ్వు!
మల్లెల పరిమళాలు వెదజల్లే
మరలు గొల్పు చిరునవ్వు!
మంచి గంధపు సువాసనల
మైమరపించే నవ్వు
చల్లని వెన్నెల కురిపించే
జాబిల్లి నవ్వు!
మొగలి పూరేకుల గుభాళింపుల
మత్తయిన నవ్వు!
నవ వసంతాలు మోసుకొచ్చే!
ఆమని చిరునవ్వు!
మెరుపులాంటి నవ్వు!
కత్తి పదనులాంటి నవ్వు!
ఈ నవ్వు! ఎన్ని రకాలైన,
ఎన్ని విధాలైన,
మానవ జాతికిది ప్రకృతి అందించిన
ఒక వరం
ప్రతి మనిషి నిత్య జీవితంలో
నవ్వుతూ బ్రతికితే!
అది అందిమను దివ్యౌషధం.

— పరాంకుశం జ్యోతిసింహాద్రి.

## కలం! బలం!

కలం బలంతో జనం బలంతో
మస్తిష్కాలకు బట్టిన మన్నును
దులిపించేస్తా! తుడిపించేస్తా!
శ్రమానంతరం దక్కే ఫలములు
శ్రమ పడకుండా సంపాదించే
ప్రబుద్ధుల బుద్ధుల వంకరలన్నీ
తనిఖీ చేస్తా! సరినే జేస్తా!
సరినే జేస్తా! తనిఖీ జేస్తా!
ప్రభంజనంలా విరుచుకుపడతా!
ప్రబల కుతంత్రాల పనినే బడతా!
వంచన దారుల పంచన బ్రతికే
కుంచిత భావుల సంకుచితత్వం
మానవ 'కుల' భావనతో
మానవతా 'మత' వాదనతో
నశింపజేస్తా జనం బలంతో!
నశింపజేస్తా కలం బలంతో!
కలం బలంతో! కలం బలంతో!

— కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం.

## గాలిపటం

ఓ చెలియా!
నీవు నన్నువిడి
ఈ విశాల జగతిలో
ఎక్కడని దాగినా
నా మనస్సు నీన్నే
స్మరిస్తుందని నీవెరుగవు!
నీవు లేని ఈ జీవితం
దారం తెగిన గాలిపటం
అది ఏ దిక్కుగా పయనిస్తుందో
నీకు తెలిసి వుంటే
నీవలా చేసే దానివే కాదు!
అయినా నిత్యం నీ ప్రేమను
కోరుకుంటూ ఎదురుచూసే
ఓ నిరాశా జీవి...

— పెరవలి రత్నాకర్

## 'కవితా సమిధలు...

కవిత్వం రాయడానికి
కావలసిన సమిధలు
వెనుకటికో కవి చెప్పినట్లు
కుక్కపిల్లా, సబ్బుబిళ్ళ—లే కాదు
కాలేకడుపు, ఎండిన ఎడద
రాలిన పండూ, ఎండిన మోడూ
కూడా
కథలు చెప్తాయి
కాకుంటే
గ్రహించగలిగిన మేధ
స్పందించగల హృది
అవసరమవుతాయి.

— సత్యం వల్లూరి.